ప్రాకారము తళతళ మెరయుచుండును. దేవీపూజలు భక్తులకు ప్రసన్నత కలుగ జేయుచుండును. అచటి హేమంతఋతువు తన గణములతో ఆయుధములతో అనురాగవతుల మనస్సులను పరవశింపజేయు చుండును. అతని భార్యలు సహశ్రీ సహ్యాశ్రీలు. అచట దేవీవ్రతము లాచరించు సిద్ధులుందురు. బంగారు ప్రాకార మున కెగువన పుష్యరాగమణుల ప్రాకారము శోభతో నుండును. అచటినేలపైనున్న వనములు ఉపవనములు అన్నియు పుష్యరాగ మయములే. పుష్యరాగపు చెట్ల పాదులు సొంపుగానుండును. అక్కడ రత్న ప్రాకారము కూడ కలదు. దానిలోని చెట్లు పక్షులు వనభూములు అన్నియు రత్నమయములే. మండపములు స్తంభ ములు సరోవరములు కమలము లును రత్నమయములే.

అచట దిక్పతులైన యింద్రాదులు ఆయుధములను ధరించి దిక్పాల సమ ష్ట్యాత్మరూపముతో ప్రకాశించుచుందురు. ఆ ప్రదేశము నకు తూర్పున ఎత్తైన శిఖరములు గల అమరావతీ పట్టణము పలువిధముల వనములతో అలరారు చుండును. అక్కడ మహేంద్రుడు విరాజిల్లుచుండును. వేల యింద్రుల తేజము గల మహేంద్రుడు వజ్రపాణియై ఐరావతము నెక్కి దేవసేనలతో గంభీరమ్ముగ వెలుగొందుచుండును. ఇంద్రాణియు దేవాంగనలతో కూడి యుండును. దానికాగ్నే యమున అగ్నిమయ పట్టణమొకటున్నట్లు అగ్ని పురము వెలుగొందుచుండును. అగ్ని అక్కడ తనభార్యలైన స్వాహా స్వధా దేవులను గూడి తన వాహనభూషణ దేవగణములతో ప్రకాశించు చుండును. దక్షిణదిశ యందు యమపురము గలదు. అందు యముడు దండధారియై చిత్రగుప్తుడు మొదలగువారితో కూడి యుండును. నైఋతి యందు రాక్షసులుందురు.

అచట రాక్షసులతో ఖడ్గధారియైన నైర్ఋతి వెలుగొందుచుండును. పడమట వరుణుడు పాశపాణియై ప్రతాపవంతుడై ఒప్పుచుండును. అతడు మహామత్స్యమును అధిరోహించి దేవసేనలను గూడి తనశక్తితో వరుణలోకమందు వరుణానితో రతిక్రీడలమునిగి తేలుచు ప్రమోదమొందుచుండును. ఇక వాయవ్యమున వాయు లోకములో వాయుదేవుడు నివాసముండును. అతడు వాయు సాధనమున సిద్ధు లైన యోగులనుగూడి ధ్వజహస్తుడు విశాలాక్షుడు మృగవాహనుడై వెలు గొందును. మరుద్గణములు తనను సేవింపగా అతడు తనశక్తిని గూడియుండును. ఉత్తర మున యక్షలోకము ప్రకాశించుచుండును.

అచట వృద్ధిబుద్ధులను శక్తుల గూడి యక్షరాజు విరాజిల్లుచుండును. అతడు ధనపతి నవనిధులకధిపతి. మణి భద్రుడు పూర్ణభద్రుడు మొదలగు యక్షసేనాధి

పతులతో కుబేరుడు తనశక్తితో అధిక సంపన్నుడై తేజరిల్లును. ఈశాన్యమున మహారుద్రలోకము విరాజిల్లుచుండును. అది విలువైన రత్నములతో నిర్మించ బడినది. అందు మహారుద్రుడు స్వయముగా ప్రకాశించుచుండును. అతడు మహోగ్రుడు దీప్తనయనుడు మూపున అమ్ముల పొదిని ధరించినవాడు. అతడు ప్రకాశించు ధనువును యెడమచేత ధరించి తనతో సమానమైన అనేక రుద్రులతో చేరి యుండును. ఆ రుద్రులు కూడా ఆయుధములను ధనుస్సులను ధరించి యుందురు. వారి భీకరముఖముల నుండి నిప్పులు కురియుచుండును. అచట వీరభద్రాదులను కూడి మహారుద్రుడు కొలువై విరాజిల్లుచుండును. అచట ప్రమథగణములు భూతసంఘముతో కూడి మహాట్ట హాసము చేయుచు శబ్దముతో భయమును కలిగింతురు.

మహేశ్వరుడు ఈశానదిక్కునకు ప్రభువగుటవలన ఈశానుడనబడు చున్నాడు. అతడు అష్టమూర్తియు మహారుద్రుడునై విరాజిల్లుచుండును. పుష్యరాగ మణుల ప్రాకారములోపల పద్మరాగమణుల ప్రాకారము ప్రకాశించుచుండును. అచటి నేలకూడ అట్లే ఎఱ్ఱగా ఉండును. ఆ ప్రాకారము పదియోజనములు ఎత్తు గలది. దానికి గోపుర ద్వారములు గలవు. అచట పద్మరాగమణులతో ప్రకాశించు మండపము లెన్నియో కలవు. ఆ ప్రాకారముల మధ్య అనేకా యుధములు కలవు. రత్నభూషణముల ధరించిన వీరులును అరువదినాలుగు కళలునుగలవు. ఆ వీరులకు ప్రత్యేకము నాయకులు గలరు. వారికి ప్రత్యేకముగ లోకములు కూడ కలవు. ఆ లోకములు కూడ పద్మరాగమణులతో నిర్మింప బడినవే. పింగలాక్షి మొదలగువారు అరువది నాలుగు కళలు శక్తులు అనబడుదురు. వారందరికినీ నిప్పులు గ్రక్కుచున్న మహోజ్జ్వలమైన నాలుకలు కలవు. వారిముఖముల నుండి అగ్నిజ్వాలలు ప్రజ్వరిల్లుచునుండును.

అందరును ధనుస్సులను బాణములను ధరించి కయ్యమునకు కాలుదువ్వుచుందురు. పటపట పండ్లు [illegible]చే కల్గు ధ్వనికి దిక్కులు పిక్కటిల్లుచుండును. ఆ వీరులందరకును కేశములూర్ధ్వముగా నుండును. వారికి విల్లంబులు ధరించిన అక్షౌహిణులసేన కలదు. ఒక్కొక్కశక్తికి లక్ష బ్రహ్మాండముల నైన సంహరింప గల శక్తి యున్నది. నూరు అక్షౌహిణులసేనలు గలవు. ఈలోకములో ఆ శక్తులకు సాధ్యము కానిదిలేదు. ఆ ప్రాకారములో వారి యుద్ధసామగ్రి భద్రపరచబడును. అచట రథములు గుఱ్ఱములు శస్త్రములు లెక్కకు మీరియున్నవి. వారందరును దేవి కొఱకై యుద్ధము చేయుటకు సన్నద్ధులైయుందురు. వీరు కోపించినచో

బ్రహ్మాండములనెల్ల నశింపజేయగలరు. గోమేధిక ప్రాకారము దాటినచో లోపలి వైపున వజ్రాలప్రాకారము ప్రకాశించుచుండును. అదియును పదియోజనములు ఎత్తుగలది. గోపుర ద్వారములందు గొలుసులు బిగించిన తలుపులు గలిగి దివ్యశోభతో నుండును. అచటి వీధులు సందుగొందులు తీగలు పక్షులు అన్నియు వజ్రమయములే బావులు చెరువులు దిగుడు బావులు వజ్రమ యములే అచ్చట భువనేశ్వరీ దేవి దాసీజనము నివసింతురు.

ప్రతి దాసియు లక్షదాసీ జనముచే సేవలందుకొనును. కొందరు విసిన కఱ్ఱలు కొందరు పాత్రలు కొందరు తాంబూలపాత్రలు చేతులతో పట్టుకొని నిలువబడి యుందురు. కొందరు దేవి పాదకమలముల నొత్తుటయందు తన్మయులగు చుందురు. కొందరు పూలదండ లల్లుచుందురు. అచటి స్త్రీలు విలాసవతులై చతురలై రాణకెక్కుదురు. ఆ యువతులెల్లరును దేవీ సేవకైనడుము బిగించి యుందురు. దేవి దయాదృష్టి ముందు ముజ్జగములను సైతము తుచ్ఛముగా తలంచెదరు. శ్రీదేవి దాసులు శృంగార మదగర్వితలు. వారెల్లరును మెరుపు తీగలవంటి శరీరము కలవారు. వారు ధ్వనిచేయు అందెలతో ఒయ్యారము లొలుకపోయుచు నిటునటు సంచరించు చుందురు. కన్నులపండువుగానుందురు.

వజ్ర ప్రాకారము దాటగా దానికెదురుగ లోపలి భాగమున వైడూర్యమణుల ప్రాకారము గలదు. అదికూడ పదియోజనముల ఎత్తైన గోపుర ద్వారము లతో విలసిల్లుచున్నది. అచటి నేల వీధులు సందులు గొందులు అన్నియు వైడూర్య మణిమయములే. అచటి వాపీకూపములు చెరువులు నదీతీరములు ఇసుక భూములు అన్నియు వైడూర్యమయములే. అచటి ఎనిమిది దిక్కులందును బ్రహ్మ మొదలగు దేవతల మండలముల గలవు. వారందరు తమతమ గణములతో కొలువులో నుందురు. బ్రాహ్మి, మహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి చాముండ యను వీరలు సప్తమాతృకలు. ఎనిమిదవ మాతృక శ్రీ మహాలక్ష్మి ప్రసిద్ధిగాంచినది. వీరు జగములకు శుభకారిణులు.

ఈ ప్రాకారము నాల్గు ద్వారములందును నిత్యము మహేశ్వరీదేవి దివ్య వాహనములు చక్కగ అలంకరింపబడి సంసిద్ధముగా నుండినవి. అచట కోట్ల కొలది ఏనుగులు గుఱ్ఱములు, రాయంచలు, సింహములు, గరుత్మంతులు వృష భములు పల్లకీలు నెమళ్ళు వాహనములై సిద్ధముగా నుండును. మరియు కోట్ల కొలది రథములు వాటికి రువైపుల పార్శ్వచరులు కలవు. అచట పలువిధముల జెండాలతో గుర్తులతోను వాద్య విశేషములతో అందమైన విమానములు కోట్ల

కొలది కనిపించుచుండును. వైడూర్యమణి ప్రాకారమునకు యెదుట ఇంద్రనీల మణులతో నిర్మింపబడిన యేడుయోజనములెత్తు గల మరియొక ప్రాకారము కలదు. అందలి వీధులు యిళ్ళు చెరువులు నూతులు యిళ్ళు అన్నియు ఇంద్ర నీలమణి నిర్మితములే.

అచట అనేక యోజనములు విస్తారము గల పద్మమొకటి కలదు. దానికి పదహారు రేకులు కలవు రెండవ సుదర్శనచక్రమా అన్నట్లుండును. అచట పదు నారు శక్తుల స్థానములు అన్ని వస్తువులతో నిండియుండును. ఆశక్తులు నీల మేఘము వంటికాంతి గలిగి చేతులందు కత్తిడాలు ధరించి యుద్ధమునకు సన్నద్ధులై యుందురు. వారుజగదీశ్వరీదేవి యొక్క సేనానాయికలు. వారు బ్రహ్మాం డములను తలక్రిందులు చేయగలశక్తితో కూడినవారు. దేవీశక్తి సంపన్నులు అనేక రథములనెక్కి అనేక శక్తులను ధరించి యుందురు. ఆదిశేషు నకు కూడ వారి పరాక్రమమును తెలుప శక్యము కాదు. అట్టి యింద్రనీల ప్రాకారము ముందు పది యోజనములు పొడవు గల గొప్ప విస్తారముతో కూడిన ముత్యాలప్రాకారము కలదు. అచటి భూమి యంతయు మౌక్తికమయమే.

అచట మధ్యభాగమున ఎనిమిది రేకులుగల పద్మమున్నది. అదికూడ ముత్యాల కాంతి తోనే ప్రకా శించుచుండును. ఆ కమలమందలి కింజల్కములు లెక్కకు మిక్కిలిగా నుండును. అచట దేవితో సమానమైన ఆకారమును ఆమె ఆయుధములవంటి ఆయుధములను ధరించినవారుందురు. వారు అష్ట మంత్రి ణులు దేవితో సమానమైన సుఖభోగముల నుభవించుచుందురు. పాండిత్యము కలిగినవారు. ఇంగితమెరిగినవారు. సమస్త లోకముల వార్తలను తెలుపజాలినవారు. అన్ని పనులందును వారు చాతుర్యము కలవారు. స్వామి కార్యపరాయణులు. అతిలోక సుందరులు. దేవి మనస్సును బాగుగా అర్థము చేసికొనినవారు. ముత్యాల ప్రాకారమునకెగువ లోపలివైపున మరకత ప్రాకారము విరాజిల్లుచుండును. అదికూడ పదియోజనముల ఎత్తున కలదు. భోగభాగ్యముల కాటపట్టు. అందలి వేలభవనములు మరకతమణులతో నిర్మింపబడి కాంతులు విరజిమ్ముచుండును. అచట ఆరుకోణములందు గాయత్రి, సావిత్రి మొదలగు దేవతలు కలరు.

అక్కడ అరువది నాలుగు ఆగమములు స్వరూపములు ధరించి భాసించు చుండును. అగ్నికోణమున చేతులందు రత్నకుంభము మణికరండము ధరించి కుబేరుడు వెలుగొందు చుండును. ధనపతి అక్కడ తన దేవితో గణములతో కూడి నివసించుచుండును. పడమటి కోణమున కామదేవుడు రతిదేవితో కూడి

చెలువు మీర నివసించుచుండును. అతడు పాశాంకుశములను చెరకు విల్లు అమ్ములను ధరించి శృంగారాది రసములు మూర్తిమంతములై సేవించుచుండ సొబగుగ నుండును. గణపతి విభూతులెన్ని కలవో అన్నియు నచట గొప్ప సంపదలతో తులతూగు చుండును.

అచట బ్రహ్మాదులు దేవతలు అందరు జగదీశ్వరిని నిత్యము సేవించు చుందురు. మరకత ప్రాకారము నకెగువ లోపలపది యోజనముల యెత్తు గల పగడాల ప్రాకారము మెరయు చుండును. దానినడుమ నున్న భవనము లన్నియు పగడాలవలె ఎఱ్ఱగా మిరుమిట్లు గొలుపు చుండును. దాని నడుమ పంచ భూతముల స్వామినులైదుగురు కలరు- హృల్లేఖ- గగన- రక్త- కరాళిక, మహోచ్ఛుష్మ యను వారలు పంచభూతముల వంటికాంతి గలవారు. వరాభయ పాశాంకుశములు ధరించి పెక్కు సొమ్ములతో దేవివలె వేషభూషలు గలిగి నవయౌవనముతో గర్వించియుందురు. పగడాల ప్రాకారమునకు ముందు పెక్కు యోజనముల వైశాల్యము గల నవరత్న ప్రాకారము కలదు. అందు ఆ మ్నాయ దేవతల భవనములు చాలకలవు. (పూర్వ దక్షిణ పశ్చిమోతరోర్ధ్వా మ్నాయములు) అచటి చెరువులు కొలకులును నవరత్న మయములే.

అచట శ్రీదేవి మహావతారములు ప్రకాశించుచుండును పాశాంకుశే శ్వరి, భువనేశ్వరి, భైరవి, త్రిపుట, అశ్వారూఢ, నిత్యక్లిన్న, అన్నపూర్ణ, త్వరిత రాజకాళి- తారషోడశి, భైరవి, మాతంగి మొదలగు పది మహావిద్యలచట స్వరూపము ధరించి ప్రకాశించు చుండును. అచట సకలదేవీ రూపములు తమతమ ఆవరణ దేవతలతో భూషణములు ధరించ కోటిసూర్యుల కాంతితో విరాజిల్లుచుందురు. అచటనే ఏడుకోట్ల మహా మంత్రములు రూపుదాల్చి శోభిల్లుచుండును. నవరత్న ప్రాకారమునకు ముందు శ్రీకరమైన చింతామణి గృహము మహోజ్జ్వలముగ ప్రభలు విరజిమ్ముచుండును. అందలి ప్రతి వస్తువుకూడ చింతామణులతో నిర్మింపబడినదే. సూర్యకాంత, చంద్రకాంత శిలలతో మెరుగుకాంతుల మణుల తోను నిర్మింపబడిన వేలమణి స్తంభము లచట దివ్యకాంతుల వెదజల్లుచుండును. చింతామణుల మధ్యభాగమున శ్రీదేవి దివ్యమందిరము విరాజిల్లుచున్నది.

ఆ దివ్యమండపమునకు వేయిమణి స్తంభములును నాలుగు మండపము లును శోభించుచుండును. అందొకటి శృంగారమండపము, రెండవది ముక్తిమండ పము, మూడవది జ్ఞానమండపము, నాలుగువది ఏకాంత మండపము, అని ప్రసిద్ధి నొందినవి. వీటియందెన్నియో మణులు అరుగులు కలవు. అవి అనేక ధూపముల

సువాసనలతో నిత్యము పరిమళముల వెదజల్లుచుండును. ఈ నాల్గింటిలో ప్రతి మండపమును కోటిసూర్య కాంతులు విరజిమ్ము చుండును. ఆ మండపములకు నాలుగువైపుల కాశ్మీరవనములు కనుల కింపుగా నుండును. అచట మంచి మల్లెపూవుల తోటలు కుందవనములును ఎన్నో పరిమళాలను వెదజల్లుచుండును. ఆ తోటలందె న్నియో మదించిన మృగములు స్వేచ్ఛగా తిరుగుచుండును. అక్కడ రత్నాల మెట్లుగల సరస్సులతో మహాపద్మ వనములు గలవు. ఆ పద్మములందు మకరందము జాలువారుచుండును. తుమ్మెదలు ఝుంకారములతో చెవుల కానందము చేకూర్చుచుండును. హంస కారండవాది పక్షులు చూడ ముచ్చటగా విహరించుచుండును. ఆ దివ్యవనము లందలి సువాసనలు నాలుగుదిక్కులకు వ్యాపించుచుండును. శృంగార మండపమందు దేవతలు మధురసుందర స్వరములతో దివ్యగానము లాలపించుచుందురు. అచట దేవతలందరు సభా సదులై వినుచుందురు. శ్రీ జగదంబ దేవి వారి నడుమ దివ్యసింహాసనముపై విరాజిల్లుచుండును.

జగదంబముక్తి మండపమందుండి బ్రహ్మాండమందలి మహాభక్తులకు ముక్తిభాగ్యమును ప్రసాదించుచుండును. జ్ఞానమండపమందుండి జ్ఞానకాంతుల వెలగిం చుచు విధేయులగు వారికి పరమజ్ఞానము నుపదేశించుచుండును. నాల్గవ మండపమునందు దేవి తన మంత్రిణులతో కొలువుండి లోకరక్షణ గూర్చి ఆలోచించుచుండును. చింతామణి గృహమందు శక్తి తత్త్వాత్మ కములైన పదిమెట్ల వరుసతో దివ్యకాంతులు విరజిమ్ము మంచము శోభిల్లు చుండును. బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, ఈశ్వరుడు ఆ మంచమునకు నాలుగు కోళ్ళు, సదాశివుడు ఆ నాల్గు పాదములపై పలకగా అలరారుచుండును. దానిపై త్రిభువనేశ్వరుడు మహా దేవుడు అయిన కామేశ్వరుడు విరాజిల్లుచుండును.

శ్రీ త్రిభువనేశ్వరీదేవియే తన లీలా విలాసమునకు రెండు రూపములు ధరించును. ఈ సృష్టికి మొట్టమొదట మహాదేవుడు త్రిభువనేశ్వరికి అర్ధాంగుడ య్యెను. అతడు మన్మథుని దర్పమడచుటకు పూనినకోటి మదనసుందరుడు. అతనికి ఐదు ముఖములు మూడు నేత్రములు కలవు. మణిభూషణ భూషితుడై అతడు తన హిరణ్యబాహువులతో జింక గొడ్డలి వరద అభయముద్రలు తాల్చి విరాజిల్లుచుండును. ఆ మహాదేవుడు సర్వేశ్వరుడు పదహారేళ్ళ యువకుడు. కోటిసూర్యుల వెలుగు కోటిచంద్రుల చల్లదనముగల దేవుడు. అతడు శుద్ధ స్ఫటి కమువలె ప్రకాశించు వాడు ముక్కంటి దయతో చల్లని చూపులు విరజిమ్మువాడు.

అట్టి త్రిభువనేశ్వరుని కెడమ ప్రక్కన శ్రీ త్రిభువనేశ్వరీ దేవి నవరత్నములు పొదిగిన వడ్డాణముతోను మేలిమిబంగారమున వైడూర్యములు పొదిగిన చేతి కంకణములతోడను ప్రకాశించుచుండును. మేలిమి బంగారముతో చేయబడిన శ్రీ చక్రాకారముగల తాటంకముల కాంతులతో అందమైన ముఖపద్మము గలదై దేవి ప్రకాశించుచుండును. ఆమె ముఖకాంతి ముందు చంద్రుడు వెలవెలబోవు చుండును. దొండ పండుకంటె అందమైన క్రింది పెదవితో నుదుటిపై కుంకుమ కస్తూరి తిలకముల సౌభాగ్యముతో దివ్యకాంతి యుతమైన ముఖముతో దేవి వెలు గొందుచుండును. సూర్యచంద్రకాంతులను మించిన దివ్యచూడామణి శిరోభూషణముగా కలదియై ఉదయించుచున్న శుక్రనక్షత్రమువంటి నాసా భరణము కలిగియున్నది. మంచి జాతిముత్యాల గుత్తులతో శోభిల్లు చింతాకు పదకము వ్రేలాడుమెడగలది.

మంచిగంధము కర్పూరము కుంకుమపూవు అలదినవక్ష స్థలము గలది. చిత్రవిచిత్రములైన అనేకా భరణములు ధరించినది. శంఖము వంటి కంఠము గలది. దానిమ్మపండు గింజలవంటి పలువరుసగలది. గండు తుమ్మెదలు మూగిన ముంగురులతో కూడిన ముఖపద్మము గలది. సుడివంటి నాభిగలది. మాణిక్య ములు పొదిగిన బంగారు టుంగరములతో శోభిల్లు చేతి వ్రేళ్ళు గలది. కమలదళ కాంతుల విరజిమ్ము మూడు నేత్రములతో నొప్పారు నది. మహోజ్జ్వలమై సర్వకళల విరజిమ్ము సహజలావణ్య శోభగలది. రత్నాల కంకణములు గలది. మెడలో మణులముత్యాహారములందు తరళమను బంగారు పద్మముగలది. రత్నపు టుంగరాల కాంతుల చిమ్మువ్రేళ్ళు గలది.

దేవి యిచ్ఛాశక్తి జ్ఞానశక్తి క్రియాశక్తులతో కూడియుండును. లజ్జ, తుష్టి మొదలగువారు స్వరూపము ధరించి యుందురు. జయవిజయ/అజిత, అపరాజిత, నిత్య, విలాసిని -దోగ్ధ్రి-అఘోర- మంగళ- నవయను పీఠశక్తులు నిత్యము పరాంబి కను సేవించుచుందురు. దేవికి రెండుప్రక్కలను శంఖపద్మ నిధులు ఎల్లప్పుడును నిండియుండును. నవరత్నములు బంగారములను ప్రవహించు నదులక్కడ పారుచుండును. ఆ నదులన్నియు తుదకు అమృత సాగరములో కలియును. శ్రీ త్రిభువనేశ్వరి కామేశ్వరి శ్రీ మహాదేవునకు ఎడమవైపున ప్రకాశించుచుండును.

మహాదేవుడు మహాశక్తితో కూడియుండుటవలననే సర్వశక్తి సహితుడై యెల్ల పనుల నెరవేర్పగలుగుచున్నాడు. చింతామణి గృహము నూరామడల వైశాల్యము గలది. దానికి ఉత్తరము వైపునున్న ప్రాకారము తూర్పు దానికంటె రెండింతలు

యెత్తుగనుండును. అది మహాకాశమున నిరాధారముగ నిలిచి యున్నది. అది నిరంతరము సంకోచవ్యాకోచముల నొందుచుండును. అది సృష్టి మొదలైనప్పుడు విప్పిన వస్త్రమువలె వ్యాకోచము నొందును. ప్రళయమున సంకోచము నొందును. చింతామణీ గృహము పరమశోభలతో పరిపూర్ణమై విరాజిల్లును. ఆ చింతామణి గృహమందు దేవి తేజస్వినియై ధగద్ధ గాయమానముగ విలసిల్లుచుండును. ఉపాసకులెల్లరును శ్రీదేవి దివ్యసన్నిధానమునకు వచ్చి చేరుదురు. కోరినకోరికలను తీర్చు వృక్షములు దిగుడు బావులు నూతులు చాలకలవు. అచట నీరు త్రాగిన వారి కోరికలెల్లతీరును. ఇందే మాత్రమును సందేహింప పనిలేదు. అచటి నీరు త్రాగినవారికి ముసలితనము రోగము వెంట్రుకలు నెరియుటయుండవు.

అచట నున్నవారికి దిగులు మాత్సర్యము కామక్రోధములుండవు. యువకులు సహస్ర సూర్యప్రభలతో తమ తమ స్త్రీల గూడి స్వేచ్ఛగా విలాసముగా విహరింతురు. వారందరును శ్రీ త్రిభువనేశ్వరీ దేవిని సేవించుచుందురు. వారిలో కొందరు సాలోక్యముక్తిని, కొందరు సార్‌ష్టిముక్తిని, మరికొందరు సామీప్యముక్తిని, సారూప్య ముక్తిని, గూడ పొందినవారు కలరు. ప్రతి బ్రహ్మాండమందలి అయా దేవత లందరును శ్రీదేవిని చేరి సమష్టిగ దేవిసేవలు చేయుచుందురు. అచట ఏడుకోట్ల మహామంత్రములు రూపమ ధరించి చేతులు జోడించి దేవినుపాసించు చుండును. అక్కడ మహా విద్యలన్నియు సామ్యావస్థను పొంది దివ్యకారణ బ్రహ్మరూపిణి మాయా శబల విగ్రహయైన భగవతి నుపాసించుచుండును.

# జనమేజయుడు శ్రీదేవీ దీక్షను స్వీకరించుట

వ్యాసమహర్షి జనమేజయునితో రాజా! పరమాద్భుతమైన దేవీ మహాపురాణ మును వినినవాడు ధన్యజీవుడగును. శ్రీదేవికి ప్రీతిపాత్రుడగును. నీ తండ్రి దుర్గతి నొందుట వలన నీవు దుఃఖపడుచున్నావు. కానీ తండ్రి నుద్ధరించుటకు నీవు దేవీ యాగమును చేయవలయును. నీవు మొదట ఉత్తమోత్తమమైన మహాదేవీ మంత్రమును దీక్షావిధానముతో స్వీకరింపుము. దానిని విధావిధానముతో నాచరించిన యెడల నీ జన్మము ధన్యమగును. అని పలుకగా వ్యాసమునీంద్రుని ప్రార్థించి యతని వలన శ్రీదేవీ ప్రణవసంజ్ఞతో నొప్పుడు శ్రీదేవీ మహామంత్రమును దీక్షా విధానముతో స్వీకరించెను. అటు పిమ్మట ధౌమ్యుడు మొదలగు మహర్షులను పిలిపించెను. దేవీ నవరాత్రములందు జనమేజయుడు ధనలోపము లేకుండ దేవీ మహాయజ్ఞమును కొనసాగించెను. బ్రాహ్మణులవలన శ్రీదేవీ మహాపురాణమును చదివించెను.

శ్రీదేవీ ప్రీతికొరకప్పుడు రాజు దేవి సన్నిధిలో చక్కగ శ్రద్ధగా శ్రీదేవీ భాగవతామృతమును తన చెవులనుదొన్నెలతో త్రాగెను. ఎందరెందరో బ్రాహ్మణులకు ముత్తైదువులకు భోజనములు పెట్టించెను. వారికి విస్తారముగ ద్రవ్యములొసగి రాజువారి నెల్లరను సంతోషపరచెను. అగ్నికాంతులు వెదజల్లు నారదుడు తన ... యను వీణను మీటుచు వచ్చినంతనే రాజు చూచి తొందరపాటుతో లేచి నిలబడెను. రాజు మునికాసనాదులొసంగి యతనిని పూజించి కుశలప్రశ్నలడిగి అతని రాకకు కారణము నడిగెను. సాధుసత్తమా! తామెక్కడ నుండి వచ్చితిరి? నేను మీకేమి ప్రియము గూర్చగలను? మీ రాకవలన ధన్యుడను అని పలుకగా ముని సత్తము డిట్లనెను రాజా!

దేవలోకము నందొక ఆశ్చర్యము చూచితిని దానిని నీకు చెప్పుటకై యిక్కడకు వచ్చితిని. నీ తండ్రి తన చెడు కర్మకు ఫలితముగ దుర్గతి పొందియుండెను. కాని నేడతడే దివ్యరూపము ధరించి దేవతలచే స్తోత్రము చేయబడుచున్నాడు. అప్సరసలతో సరస సల్లాపములాడుచు దివ్యవిమాన మెక్కి మణిద్వీపమునకు వెళ్ళెను. దీనకంతటికిని కారణము నీవు దేవీ భాగవతమును వినిన ఫలమే. నీవును ఆ యజ్ఞమును నాచరించుట వలన నీ తండ్రి సద్గతి నొందెను. నీ జన్మము చరితార్థమైనది. ధన్యమైనది- సఫలమైనది- కులభూషణా! నీవు నీ తండ్రిని నరక కూపము నుండి ఉద్ధరించితివి. ఇపుడు దేవీలోకమున నీ ప్రశంసలు మిన్నుముట్టినవి. అంతట జనమేజయుడు ప్రేమతో అద్భుతకర్ముడగు వ్యాసుని పాదములపై పడి నమస్కారించెను.

మహాముని! నీ యనుగ్రహముచే ధన్యుడనైతిని. ఈ నీమహోపకారమునకు నమస్కారము చేయుటకన్న ప్రతిఫలమే మీయగలను? ఇప్పటివలె నీ దయనాపై ఎప్పటికిని నిలిచి యుండనిమ్ము. అను రాజు మాటలు విని వ్యాసుడు తన నాశీస్సులచే నభినందించెను. మరియు ప్రియమృదువచనములతో నిట్లనెను. రాజా! నీవన్నిభనునది శ్రీదేవి పాదపద్మములు నిత్యము కొలుచుచుండుము. ప్రతిదినము విధేయుడవై శ్రీ దేవీ భాగవతమును శ్రద్ధగా చదువుము. భక్తితో దేవీ యజ్ఞము చేయుచుండుము. అట్లు చేయుటచే సంసార బంధములనుండి విడువబడి సుఖముగా ముక్తిని పొందెదవు. యిదికాక శివ పురాణము, విష్ణు పురాణము, ఇతర దేవతల పురాణములు ఎన్నో కలవు అవియన్నియు దేవి పురాణములో పదహారవంతుకు సాటిరావు. ఈ దేవీ భాగవతమెల్ల పురాణముల సారము. ఏలయన ఇందులో శబల బ్రహ్మరూపిణియైన మూలప్రకృతి ప్రతిపాదింపబడినది. ఇది త్రిగుణముల సామ్యావస్థను తెలియజేయును. ఇతర పురాణములు

తెలుపవు. కావున అవి దీనికి సరిగావు. జనమేజయా! దేవీ భాగవతము చదువుట వలన వేదము చదివినంత ఫలము కలగును. పుణ్యము కలుగును. ఉత్తమ విద్వాంసులు తప్పక నిత్యము దేవీ భాగవతము చదువుచుండవలయును. అని పలికి వ్యాస మహాముని జనమేజయుని వీడ్కొని వెళ్ళెను. ధేమ్యాది మునులు సంతమత తావులకరిగిరి. వారందరు దేవీ భాగవతమును ప్రశంసింపదొడగిరి. తరువాత జనమేజయుడు సంతోషముతో చక్కగా రాజ్యము చేసెను. మరియు నతడు దేవీ భాగవతమునే వినుచు చదువుచు తన జీవితమును సార్థకమొనర్చుకొనెను.

# శ్రీదేవీ భాగవత శ్రవణాధిఫలము

సూతమహర్షి ఇట్లనెను. శ్రీదేవి ముఖపద్మమునుండి సగము శ్లోకము వెలువడినది. అదే వేదసిద్ధాంతమును ప్రబోధించునట్టి శ్రీదేవీ భాగవతముగా రూపొందినది. ఈ శ్లోక సగభాగమే పూర్వము శ్రీదేవి వటపత్ర శాయియగు శ్రీవిష్ణువునకు తెలియజేసెను. దానియందున్న గొప్ప యర్థమును బ్రహ్మ నూరుకోట్ల శ్లోకములలో వివరించాడు. ఆ శ్లోకములలోని సారమంతయు గ్రహించి వేదవ్యాస భగవానుడు శుకమునికొరకు పద్దెనిమిది వేల శ్లోకములుగల పన్నెండు స్కంధములుగా విభజింపబడిన దేవీభాగవతము నుపదేశించెను. బ్రహ్మ రచించిన దేవీ భాగవత మహా పురాణము నేటికి దేవలోకమందు ప్రసిద్ధి పొందియున్నది. దేవీ భాగవతముతో సమానమైన పాపనాశనము పవిత్రము పుణ్యప్రదము నగు పురాణ మింతవరకును మరియొకటిలేదు. దీనిని శ్రద్ధతో చదివిన మానవుడు అడుగడున అశ్వమేధయాగఫలమును పొందును.

ఈ పురాణమును చదివి చెప్పు వానిని వ్యాసునిగా తలచి అతనిని సత్కరించి నియమముతో అతని ముఖము నుండి దేవీ భాగవతమును చక్కగా వినవలయును. ఈ దేవీభాగవతమును వ్రాసినవాడు వ్రాయించినవాడు భాద్రపద శుద్ధ పూర్ణిమనాడు పీటపై నుంచి పౌరాణికునకు దానము చేయవలయును. దూడగల పాడియావును దక్షిణగా బ్రాహ్మణునకు దానమీయవలయును. పిమ్మట బ్రాహ్మణులకు ముత్తైదులకు కన్యకలకును బ్రహ్మచారులకు భోజనము పెట్టవలయును. కన్యలను ముత్తైదువులను దేవీ భావముతో సత్కరించి పువ్వులతో పూజింపవలయును. పాయసమును వారికి తృప్తిగా అర్పించవలయును. దేవీ పురాణ దానము భూదానముతో సమానమైన ఫలము నిచ్చును.

అట్టిదాత యీలోకమున సుఖించి చివరకు దేవ లోకమును చేరును. ఈ దేవీ భాగవతమును నిత్యము శ్రద్ధా భక్తులతో చదువువానికి ఎక్కడైనను ఎప్పుడై

నను ఏదిరియైనను అసాధ్యముకాదు. దీని చదువుట వలన పుత్రులు లేనివారికి పుత్రులు, సంపదలేనివారికి సంపద విద్యార్థికి సంపూర్ణ విద్య ప్రాప్తించును. భూమిపై అతడు కీర్తిగలవాడై గౌరవము సంపాదించును. గొడ్రాలు సంతానవతి యగును. ఈ విషయమున ఎట్టి సంశయమునులేదు. ఏయింట శ్రీదేవీ భాగవతము నిత్యము పూజింపబడునో అయింట లక్ష్మీ సరస్వతులు నివాసమందురు. అయింటినిదాకి నీ భేతాళాదులు కన్నెత్తి చూడ జాలరు. జ్వరరోగ బాధలో నున్న వానిని తాకి దీనిని పఠించినచో ఎంతటి దాహ జ్వరమైన శాంతించును. దీని నూరుమార్లు చదివినచో క్షయరోగములు తొలగును.

ప్రతిదినము సంధ్యావందనము చేసి తరువాత నియతముగ ఒక్కొక్క అధ్యాయము చొప్పున దీనిని చదువువాడు మహాజ్ఞానికాగలడు. మనము చేయు పనులు ఆ దేవిని తలచుకొని చేసినచో నెట్టియాటంకము లేక నెరవేరగలవు. నవ రాత్రములలో భక్తితో దేవీ భాగవతమును నిత్యము చదువవలయును. చైత్రాషాఢ ఆశ్వయుజ మాఘ మాసములందు శుక్లపక్ష నవరాత్రులందు దేవీభాగవతమును తప్పక చదువవలెను. దేవి ప్రసన్నురాలై కోరికలను పండించును. అన్ని దేవతల ఉపాసనలు శక్తిమూలముననే జరుగు చుండును. గనుక దేవీ భాగవతము పఠనము తప్పక చేయుదగినది. ఇంక వేయి మాటలేల? దేవీ భాగవతము వేదసారము హ్రీంమయి శ్రీదేవిని నమస్కరిస్తున్నాను. నైమిశారణ్యవాసులు దీనిని విని సూతమహర్షిని పూజించిరి.

శ్రీదేవి పాదపద్మముల నిత్యము పూజించు భక్తుల మనస్సులు ఆనందమున నోలలాడుచుండును. గనుక సూతమహర్షి నుండి విన్నవారందరు ప్రసన్న హృదయులై వారివారి నివాసములకు వెడలిరి. వెళ్ళిపోవునప్పుడు సూతమహర్షికి శ్రమ కలిగించినందుకు మునులెల్లలరును మాటిమాటికి ఆతనికి నమస్కారము లొనర్చిరి. ఈ విధముగ సకలవేద రహస్యము దుర్గమమునైన ఈ శ్రీదేవీ భాగవత మహాపురాణమును సూతమహాముని మునివరులకు విని పించి వారిచేత స్తుతింపబడి వారి నాశీర్వదించి జగదంబా చరణకమలముపై తిరుగాడు తుమ్మెదయైన యెదతో తన యాశ్రమమునకు వెళ్ళెను.

# గౌతముని శాపము

గౌతముడప్పుడాశ్చర్యము చెంది హోమమును ఆపివైచెను. వెంటనే సమాధిలో మనస్సును నిలిపి దీని కారణము తెలిసికొనెను. ఇది యంత బ్రాహ్మణులు

పన్నినపన్నాగమేయని అతడు తెలిసికొనెను. ఆ సమయమున గౌతముడు ప్రళయరుద్రుని వలె కనులెఱ్ఱజేసి బ్రాహ్మణు లనందరను ఈవిధముగా శపించెను. ఓ బ్రాహ్మణాధములారా మీరు వేదమాతయగు గాయత్రి ధ్యానము జపము మానివేయుదురుగాక. గాయత్రీమాతను వదలుటవలన మీరు తప్పక బ్రాహ్మణాధములగుదురుగాక. వేదములందు యజ్ఞములందును మీరు చెడుభావము కలవారగుదురుగాక. మీరు మూల ప్రకృతియైన శ్రీదేవి యొక్క ధ్యానమందు కథలయందును రుచిలేని వారగుదురు గాక.

శ్రీదేవీమంత్రము యొక్క అనుష్ఠానమును విడిచి బ్రాహ్మణాధములగుదురుగాక. శ్రీదేవీ మహోత్సవములు చూచుటకు శ్రీదేవీ దివ్యనామమును కీర్తించుటకును మీరు నోచకుందురుగాక. రుద్రాక్షలు, మారేడు, భస్మము వీటి యందు ప్రీతికలుగ కుండుగాక. శృతిస్మృతులందలి సదాచారమును జ్ఞానమార్గమును వదలితిరుగుబోతులై బ్రాహ్మణులలో నీచులై ప్రవర్తింతురుగాక. నికృష్టజీవములగ బ్రాహ్మణ భ్రష్టులుగ తిరుగుదురుగాక, నిత్యకర్మా నుష్ఠానమును అగ్నికార్యమును నెరవేర్చుటకు పెడమొగము పెట్టెదరుగాక. గోదానము, పితృ శ్రాద్ధములు చేయుటకు ఇష్టపడని నికృష్టజీవనులగుదురుగాక. కృఛ్ర చాంద్రా యణాది ప్రాయశ్చిత్తములాచరింపక దురాచారపరులై సంచరింతురుగాక. ఇతర దేవతలను కొలిచి చెడిపోదురుగాక. కాపాలిక బౌద్ధపాషండాది మతములందాసక్తి కలవారై చెడుదురుగాక. తల్లిదండ్రులను కన్నబిడ్డలను, సోదరులను, భార్యను అమ్ముకొని బ్రతువారగుదురు. పర స్త్రీ వ్యామోహము కలవారుగుదురుగాక మీరే కాక మీ మీవంశములందలి స్త్రీ పురుషులును నాశాపాగ్నికి భస్మమగు దురు. ఇంత చెప్పనేల!

ఆ మూలప్రకృతి మహేశ్వరియైన గాయత్రీదేవియు మిమ్ములను కోపించి యుండును. మీరు అంధకూపము మొదలగు నరక యాతనలందు మ్రగ్గుదురు గాక. ఇట్లు గౌతముడాబ్రాహ్మణులను శపించి నీటిని స్పృశించెను. తరువాత మహానందముతో గౌతమముని గాయత్రీ దర్శనమునకు బయలుదేరెను. మహాదేవిని దర్శించి గౌతముడు ప్రణమిల్లెను. పరాత్పరయగు దేవియును బ్రాహ్మణులు చేసిన దురాచారము నకు ఆశ్చర్యపడెను. మరియు చిరునవ్వుతో నామె మునివర్యునికిట్లు పలికెను. పామునకు పాలుపోసిన విషమగును. మహాను భావా! నీవిప్పుడు శాంతించుము కర్మగతి యిట్లేయుండును. దేవి వాక్కులువిని గౌతముడు దేవికి నమస్కరించి తనయాశ్రమమునకు వెళ్ళెను. బ్రాహ్మణులందరు శాపదగ్ధులగుటచే వేదములు మరచిరి. గాయత్రీమంత్రము గుర్తు వచ్చుట లేదు.

ఇది యంతయు విచిత్రముగా నుండెను. శాపగ్రస్తులైన బ్రాహ్మణులు పశ్చాత్తాపము నొందిరి. వారు గౌతమునికి సాష్టాంగ నమస్కారము చేసిరి. సిగ్గుచే వంచిన తలను యెత్తలేకుండిరి. ప్రసన్నుడ వగుము ప్రసన్నుడ వగుము. అనివారు మునిని పలుమార్లు ప్రార్థించిరి. వారందరును గౌతముని చుట్టుచేరి వేడుకొన సాగిరి. ముని హృదయము ద్రవించినది.

అతడు దయతో వారికిట్లనెను:- మీరందరును శ్రీకృష్ణావతారము వరకు నరకము నందుండుడు. మీరు మరల కలియుగమున జన్మించెదరు. అప్పుడు మీకు నేనిచ్చిన శాపములన్నియు అనుభవమునకు వచ్చును. ఇది నిజము నమ్ముడు. నా మాటకు తిరుగులేదు. కాని నాశాపమునుండి విముక్తి పొందదలచినచో మీరు గాయత్రీదేవి పాదపద్మములను సేవింపుడు. ఇట్లు గౌతమ మునిపలికి వారిని విడిచి అంతయు ప్రారబ్ధ కర్మఫలమని తలచి శాంతచిత్తుడయ్యెను.

కృష్ణావతారము ముగియగనే కలియుగము ప్రారంభించినది. అప్పుడు శాపమును పొందినవారే ఇప్పుడే గాయత్రీజపము చేయని బ్రాహ్మణులు ఇకవారట్లే దురాచారపరులై నరక దుఃఖము లనుభవించుచుందురు. నీవు మాత్రము సర్వాత్మభావముతో శ్రీ పరమేశ్వరినే సేవింపుము. గాయత్రీ మహాదేవి నుపాసించుటయే నిత్యోపాసనమనబడును. గాయత్రీదేవి నుపాసించనివాడు తప్పక పతితుడు కాగలడు. అని యిట్లు గాయత్రీ దేవి మహిమను వివరముగా వ్యాసుడు రాజుకు చెప్పెను.

## శ్రీదేవీ భాగవత సంగ్రహము
## పన్నెండు స్కంధముల సారాంశము సమాప్తము

**ఓమ్ సర్వచైతన్యరూపాం తా మాద్యాం విద్యాం చ ధీమహి।**
**బుద్ధిం యా నః ప్రచోదయాత్**

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమం ।
దేవీం సరస్వతీం చైవ తతో జయముదీరయేత్ ॥
అచతుర్వదనోబ్రహ్మా ద్విబాహురపరోహరిః ।
అఫాలలోచన శ్శంభుః భగవాన్ బాదరాయణః ॥
ఏతత్ సర్వం పరదేవతార్పితమస్తు పరదేవతానుగ్రహా సిద్ధిరస్తు
శ్రీమాత్రే నమః శ్రీ మాత్రే నమః శ్రీ మాత్రే నమః

# శ్రీ దేవీ ఖడ్గమాలా స్తోత్రరత్నమ్

శ్లో॥ హ్రీంకారాసనగర్భితానలశిఖాం సౌః క్లీం కళాం బిభ్రతీం
సౌవర్ణాంబరధారిణీం వరసుధా ధౌతాం త్రినేత్రోజ్జ్వలాం
వందే పుస్తక పాశ మంకుశధరాం స్రగ్భూషితా ముజ్జ్వలాం
త్వాం గౌరీం త్రిపురాం పరాత్పరకళాం శ్రీచక్ర సంచారిణీమ్ ॥

అస్యశ్రీ శుద్ధశక్తిమాలామహామంత్రస్య, ఉపస్థేంద్రియాధిష్ఠాయీ వరుణాదిత్య ఋషిః దైవీ గాయత్రీ ఛందః, సాత్విక కకార భట్టారక పీఠస్థిత కామేశ్వరాంకనిలయా మహాకామేశ్వరీ శ్రీలలితా పరాభట్టారికా దేవతా, ఐం బీజం, క్లీం శక్తిః, సౌః కీలకం, మమ ఖడ్గసిద్ధ్యర్థే సర్వాభీష్ట సిద్ధ్యర్థే జపే వినియోగః మూలమంత్రేణ షడంగన్యాసం కుర్యాత్, ధ్యానమ్; తాదృశం ఖడ్గమాప్నోతి యేన హస్త స్థితేనవై, అష్టాదశమహా ద్వీప సమ్రాడ్భోక్తా భవిష్యతి॥ ఆరక్తాభాం త్రినేత్రా మరుణిమ వసనాం రత్న తాటంక రమ్యాం। హస్తాంభోజైస్స పాశాంకుశ మదనధనుస్సాయ కైర్విస్ఫురంతీం। ఆపీనోత్తుంగ వక్షోరుహ పరివి లుఠత్తారహారోజ్జ్వ లాంగీం। ధ్యాయే దంభోరుహస్థా మరుణిమ వసనా మీశ్వరీ మీశ్వరాణామ్ ॥

లమిత్యాది పంచపూజాం కుర్యాత్, యథాశక్తి మూలమంత్రం జపేత్.

ఓం ఐం హ్రీం శ్రీం ఐం క్లీం సౌః ఓం నమస్త్రిపురసుందరి, హృదయదేవి, శిరోదేవి, శిఖాదేవి, కవచదేవి, నేత్రదేవి, అస్త్రదేవి, కామేశ్వరి, భగమాలిని, నిత్యక్లిన్నే, భేరుండే, వహ్నివాసిని, మహా వజ్రేశ్వరి, శివదూతి త్వరితే కులసుందరి, నిత్యే, నీలపతాకే, విజయే, సర్వమంగళే, జ్వాలా మాలిని, చిత్రే, మహానిత్యే పరమేశ్వర పరమేశ్వరి, మిత్రేశమయి, షష్ఠీశమయి, ఉడ్డీశమయి, చర్యానాథమయి, లోపాముద్రామయి, అగస్త్యమయి, కాల తాపవమయి, ధర్మా చార్యమయి, ముక్తకేశీశ్వరమయి, దీపకళానాథమయి, విష్ణు దేవ మయి, ప్రభాకర దేవమయి, తేజోదేవమయి, మనోజ దేవమయి, కళ్యాణ దేవమయి, వాసుదేవమయి, రత్నదేవమయి, శ్రీరామానంద మయి, అణిమాసిద్ధే, లఘి మాసిద్ధే, గరిమాసిద్ధే, మహిమాసిద్ధే, ఈశిత్వసిద్ధే, వశిత్వసిద్ధే, ప్రాకామ్యసిద్ధే, భుక్తిసిద్ధే, ఇచ్ఛాసిద్ధే, ప్రాప్తిసిద్ధే, సర్వకామసిద్ధే, బ్రాహ్మి, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, మాహేంద్రి, చాముండే, మహాలక్ష్మి, సర్వసంక్షోభిణి, సర్వవిద్రావిణి, సర్వాకర్షిణి, సర్వవశంకరి, సర్వోన్మాదిని, సర్వమహాంకుశే, సర్వఖేచరి, సర్వబీజే, సర్వయోనే, సర్వత్రిఖండే, త్రైలోక్య మోహన చక్ర స్వామిని, ప్రకటయోగిని, కామాకర్షిణి, బుద్ధ్యాకర్షిణి, అహంకారాకర్షిణి, శబ్దాకర్షిణి, స్పర్శాకర్షిణి, రూపాకర్షిణి, రసాకర్షిణి, గంధాకర్షిణి, చింతాకర్షిణి, ధైర్యాకర్షిణి, స్మృత్యాకర్షిణి, నామాకర్షిణి, బీజాకర్షిణి, ఆత్మాకర్షిణి, అమృతాకర్షిణి, శరీరాకర్షిణి, సర్వాశాపరిపూరక చక్రస్వామిని, గుప్తయోగిని, అనంగ కుసుమే, అనంగమేఖలే, అనంగ

మదనే, అనంగమదనాతురే, అనంగ రేఖే, అనంగవేగిని, అనంగాంకుశే, అనంగ మాలిని, సర్వ సంక్షోభణ చక్ర స్వామిని, గుప్తతరయోగిని, సర్వసంక్షోభిణీ, సర్వవిద్రావిణీ, సర్వాకర్షిణీ, సర్వాహ్లాదిని, సర్వ సమ్మోహిని, సర్వస్తంభిని, సర్వ జృంభిణీ, సర్వవశంకరి, సర్వరంజని, సర్వోన్మాదిని, సర్వార్ధసాధికే, సర్వసంపత్తి పూరణీ, సర్వమంత్రమయి, సర్వద్వంద్వ క్షయంకరి, సర్వసౌభాగ్యదాయక చక్రస్వామిని, సంప్రదాయ యోగిని, సర్వసిద్ధిప్రదే, సర్వసంపత్ప్రదే, సర్వప్రియంకరి, సర్వమంగళ కారిణీ, సర్వకామప్రదే, సర్వదుఃఖ విమోచని, సర్వమృత్యు ప్రశమని, సర్వవిఘ్ననివారిణీ, సర్వాంగసుందరి, సర్వసౌభాగ్యదాయిని, సర్వార్ధసాధక చక్రస్వామిని, కుళోత్తీర్ణయోగిని, సర్వజ్ఞే, సర్వశక్తే, సర్వైశ్వర్య ప్రదాయిని, సర్వజ్ఞానమయి, సర్వవ్యాధివినాశిని, సర్వాధార స్వరూపే, సర్వ పాపహరే, సర్వానందమయి, సర్వరక్షాస్వరూపిణీ, సర్వేప్సిత ఫలప్రదే, సర్వరక్షాకర చక్ర స్వామిని, నిగర్భయోగిని, వశిని, కామేశ్వరి, మోదిని విమలే, అరుణే, జయిని, సర్వేశ్వరి, కౌళిని, సర్వరోగహర చక్రస్వామిని, రహస్య యోగిని, బాణిని, చాపిని, పాశిని, అంకుశిని, మహాకామేశ్వరి, మహావజ్రేశ్వరి, మహాభగ మాలిని, సర్వసిద్ధిప్రద చక్రస్వామిని, అతి రహస్యయోగిని, శ్రీశ్రీ మహాభట్టారికే, సర్వానందమయ చక్రస్వామిని, పరాపర రహస్య యోగిని, త్రిపురే, త్రిపురేశి, త్రిపురసుందరి, త్రిపురవాసిని, త్రిపురాశ్రీః, త్రిపురమాలిని, త్రిపురాసిద్దే, త్రిపురాంబ, మహాత్రిపుర సుందరి, మహామహేశ్వరి, మహామహా రాజ్ఞి, మహామహాశక్తే, మహామహాగుప్తే, మహామహాజ్ఞప్తే, మహామహానందే, మహా మహాస్కంధే, మహామహాశయే, మహామహా శ్రీ చక్రనగర సామ్రాజ్ఞి, నమస్తే నమస్తే నమస్తే నమః.

## దుర్గా స్తోత్రం

శ్లో॥ మాతర్మే మధుకైటభఘ్ని మహిష ప్రాణపహారోద్యమే
హేలానిర్మిత ధూమ్రలోచన వధే చండ ముండార్ధినీ
నిశ్శేషీ కృత రక్తబీజ దనుజే నిత్యే నిశుంభాపహే
శుంభ ధ్వంసిని సంహరా శు దురితం దుర్గే నమస్త్యంబికే ॥

శ్లో॥ శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణే
సర్వస్యార్తి హరే దేవి నారాయణి నమోస్తుతే ॥

శ్లో॥ సర్వ స్వరూపే సర్వేశే సర్వశక్తి సమన్వితే
భయే భ్యస్త్రాహినో దేవీ దుర్గాదేవీ నమోస్తుతే ॥

శ్లో॥ సర్వబాధా ప్రశమనం - త్రైలోక్యస్యాదఖిలేశ్వరి
ఏవ మేవ త్వయా కావా మస్మద్వైరి వినాశనం ॥